# రెండుకాదు ఇరవైరెండు

**ఆ రోజు ఆదివారం. వరండాలో వాలుకుర్చీలో కూచుని పేపరు చదువుకుంటోంది సుగుణ.**

రోజూ అలా స్థిమితంగా చదవడానికి కుదరదు. వంటపనీ, పైపనులూ చూసుకోవడం, పిల్లని తెమిల్చి స్కూలుకి పంపించడం, భర్తతోపాటు తనూ తయారై ఆఫీసుకు వెళ్లడం - ఆ హడావిడిలో వార్తల శీర్షికలు చదవడానికి కూడా సమయం చాలదు. సాయంకాలం మళ్లీ పిల్లచేత హోంవర్క్ చేయించడం, వంట, కాసేపు టీ.వి - వీటితోటే సరిపోతుంది. ఇంకా ఆఫీసులోనే నయం- ఎప్పుడైనా పేపరు తిరగెయ్యడానికి వీలవుతుంది.

అలా పేపరు చదువుతూండగా (ఆ సమయంలో భర్త ఎవరినో కలుసుకోవడానికి బయటికి వెళ్లాడు; కూతురు టీ.విలో కార్టూన్ ఫిల్మ్ చూస్తోంది) - ఇల్లుగలావిడ వచ్చింది.

సావిత్రమ్మగారు కొంచెం పూర్వకాలపు మనిషి. ఆవిడ పొద్దున్నే కళ్లు తెరవగానే ముందుగా మంగళసూత్రాలు చేత్తోపట్టుకుని కళ్లకద్దుకుంటుంది. అలాగే సాయంకాలం దీపాలు పెట్టగానే చేస్తుంది. 'ఎందుకండీ అలా చేస్తారు?' అని సుగుణ అడిగిందొకసారి.

'ఆడదానికి మాంగల్యమే కదా ముఖ్యం' అందావిడ.

'అంతకన్న ముఖ్యమైన వెన్నో ఉన్నాయి కదండీ ' అంది సుగుణ.

'చదువుకున్నావన్న పేరేగాని ఏమీ తెలియదమ్మా నీకు! మీ చదువుకున్న వాళ్లు తెలుసుకోవలసినవి చాలా ఉన్నాయి' అందావిడ.

అందుకే ఆవిడ దగ్గర తనకి తెలియని సూక్ష్మాలు తెలుసుకునే నెపంతో అప్పుడప్పుడు ఆవిడ మీద పరిశోధన చేస్తూ ఉంటుంది సుగుణ!

సావిత్రమ్మగారు పూర్వపు వాళ్లు చెప్పిన వ్రతాలూ, నోములూ, పూజలూ ఎన్నో చేసింది. ఇంకా చేస్తూనే ఉంది. పేరంటాలకీ, గుడికీ వెళ్లడానికి తప్ప సాధారణంగా ఇల్లు కదల దావిడ. ఇంటికి ఏం కావలసి వచ్చినా మొగుడే తెచ్చి పడేస్తాడు. ఒకవేళ ఏదన్నా నిండుకుంటే, పెరట్లోంచి పక్కింటి కాంతమ్మగారిని పిలిచి అప్పు అడుగుతుంది. మళ్లీ తీర్చేస్తుంది.

సాధారణంగా సుగుణ దగ్గర ఏదీ తీసుకోదు ఏ చిల్లరో తప్ప. సుగుణ మడీ ఆచారం పాటించదని వాళ్లింట్లో వస్తువులు ఓ పట్టాన ముట్టుకోదు - అత్యవసరమైతే తప్ప. అంతేకాదు సుగుణ ఉద్యోగం చేస్తూ అవస్థ పడటం ఆవిడకి నచ్చదు. 'ఆడవాళ్లు ఉద్యోగాలు చేసి ఏం ఉద్ధరిస్తున్నారు? రోజుకో రకం చీర కట్టుకుని ఆఫీసుకి వెళ్లడం, వంటింట్లో భర్తచేత చాకిరీ చేయించడం, పిల్లలు వద్దనుకోవడం' - అంటూ ఓ దండకం చదువుతుందావిడ. సుగుణ తనకున్న ఆడపిల్ల ఒక్కర్తీ చాలు, ఇంక పిల్లలక్కర్లేదు అనుకోవడం మరీ ఓ త్యాగంలా అనిపిస్తుందావిడకి. అలా అని ఆవిడకి సుగుణంటే ఇష్టం లేకపోవడం లేదు.

'రండి సావిత్రమ్మగారూ! ఏఁవన్నా కావాలాండీ?' అంది సుగుణ కుర్చీలోంచి లేస్తూ.

'అబ్బే, ఏఁవీ అక్కర్లేదు' అంటూ పక్కనున్న గట్టుమీద కూచుంది.

'ఏఁవిటీ, మీ ఇద్దరి ఫోటోలూ ఏదో పత్రికలో పడ్డాయిట - ఆ కాంతమ్మగారి కోడలు చెప్పింది' అని మొదలు పెట్టిందావిడ.

'అవునండీ, "అన్యోన్య దంపతులు" అనే శీర్షిక కింద మమ్మల్ని గురించి రాసి మా ఫోటోలు వేశారండి' అంది సుగుణ.

'వాళ్ల కెలా తెలుసు మీరు అన్యోన్య దంపతులని?'

'ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో కొంతమందిని- ముఖ్యమైన ఆఫీసుల్లో పనిచేస్తున్న ఆడవాళ్లని కొందరిని ఎంచుకుని ఆ పత్రిక వాళ్లొచ్చి కొన్ని ప్రశ్నలడిగారు. ఆ ఆడవాళ్ల భర్తల్ని కూడా కలుసుకుని వాళ్లని కూడా ప్రశ్నలడిగి అప్పుడు తెలుసుకున్నారు. నెలనెలా ఒక్కొక్క జంట గురించి రాస్తున్నారండి.'

'నాకు తెలియకడుగుతానూ, మీరూ అందరికిమల్లే కీచులాడుకుంటూనే ఉంటారు కదా, మరి అన్యోన్య దంపతులెట్లా అయారు? మీరిద్దరూ ఆ మోటారు సైకిలు మీద తిరుగుతూ ఉంటారనా?' అని ఆరా తీసిందావిడ. ఆవిడ భర్తని ఎందుకో అందుకు సాధిస్తూనే ఉంటుంది - బజారు నుంచి తేవలసిన సరుకు ఏదో మరిచిపోయాడనో, సరుకు నాసిరకం తెచ్చాడనో - ఎందుకో ఒకందుకు. ఆయనా కసురుతూనే ఉంటాడు పెళ్లాన్ని చీటికీ మాటికీ.

'మనుషులన్నాక భేదాభిప్రాయాలుంటాయి కదండీ. భార్యాభర్తలకీ మాత్రం ఉండవా? అప్పుడప్పుడు వాదోపవాదాలు తప్పవు కదా. కానీ, సంసార బాధ్యతల్ని ఇద్దరూ కలిసి మెలిసి ఎలా నిర్వహిస్తున్నారు, ఒకరినొకరు ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారు, ఎంతగా గౌరవించుకుంటున్నారు అన్నదాన్ని బట్టి వాళ్ల అన్యోన్యత తెలుస్తుంది కదండీ' అంది సుగుణ మర్యాదగా.

'ఏమో, ఈ అన్యోన్యతలూ, ఒకరినొకరు అర్థం చేసుకోవడాలూ, గౌరవించుకోవడాలూ

- ఇలాంటివి మాకు తెలియవు సుమా. భర్త అంటే ఇంటికి యజమాని. నేను భార్యని - నా పతివ్రతా ధర్మం నేను నిర్వర్తించడం - అంతవరకే తెలుసు నాకు'.

'ఎక్కడ తెలుసుకున్నారండీ ఈ ధర్మాలన్నీ మీరు?' అని అడిగింది సుగుణ ఏమీ ఎరగనట్లు.

'ఏముందమ్మా, వ్రత కథలూ, పురాణాలూ లేవూ? ఆడవాళ్లు ఎవరు నేర్చుకున్నా, పెద్దవాళ్లు ఎవరు నేర్పినా వాటి నుంచే కదా.'

'మరి మీకు అందులో లోపాలేవీ కనిపించలేదాండీ?'

'లోపాలేమిటమ్మా? మరీ చిత్రంగా మాట్లాడుతున్నావు!' అందావిడ.

'ఆదర్శగృహిణి లక్షణాలు ఎలా ఉండాలో, పతివ్రతా ధర్మాలేమిటో ద్రౌపది సత్యభామకి బోధించిందిటండీ. ఈ మధ్యనే మా స్నేహితురాలొకావిడ వాటి గురించి ఒక వ్యాసంలో రాసిందండీ. అది చదివాక నా కనిపించింది. అటువంటి ఆదర్శ గృహిణులూ, పతివ్రతలూ ఈ కాలంలో ఎవరైనా ఉంటారా అని!' అంది సుగుణ నవ్వుతూ.

'అయ్యో, అయ్యో,ఎంతమాట! అందరినీ ఒక్క తాటిని కట్టేస్తున్నావు' అంటూ మంగళ సూత్రాలు రెండూ పైకి తీసి కళ్లకద్దుకుని మళ్లీ పమిటలో దోపుకుందావిడ.

'ఇంతకీ ఏమని బోధించిందమ్మా ఆ ద్రౌపది?' అందావిడ కుతూహలంగా ముందుకి జరిగి. ఆవిడకి పురాణాలంటే మహా ఇష్టం.

'ఉండండి, ఆ వ్యాసం పట్టుకొస్తాను' అని చెప్పి, సుగుణ లోపలికి వెళ్లి అలమారులోంచి వెతికి తీసుకొచ్చి 'ఇదిగో వినండి' అంటూ ఆ వ్యాసంలోని కొంత భాగాన్ని చదవడం మొదలు పెట్టింది.

"1. భార్య భర్తని అనుసరిస్తూ మెలగాలి."

'అవునూ, అందులో కొత్తగా చెప్పేదేముంది?' అంటూ వ్యాఖ్యానించింది సావిత్రమ్మ గారు.

"2. భర్త మరో వనిత మీద మోజు పడినా, అలగకుండా సహించాలి."

ఒక్కక్షణం ఆగింది సుగుణ. అనుకున్నట్లుగానే సావిత్రమ్మగారు తక్షణం స్పందించింది.

'ఊఁహూఁ, మొగుడెన్ని వేషాలు వేసినా సహించాలా!' అని సాగదీసిందావిడ.

మనసులో, సుగుణ ఆ పాయింటుకి ఆవిడకి మార్కులు కొట్టేసింది. చదవడం కొనసాగించింది.

"3. భర్త పట్ల భక్తి కలిగి ఉండాలి".

'అవును మరి. పతిభక్తే కదా పతివ్రతా లక్షణం' అందావిడ.

రెండో పాయింటుకీ, మూడో పాయింటుకీ ఆవిడ స్పందనలో వైరుధ్యం ఉందని ఆవిడ గుర్తించలేదు. సుగుణ ఏమీ అనలేదు - ఎందుకొచ్చింది అనుకుని.

"4. ఇతర పురుషుల్ని తృణప్రాయంగా చూడాలి."

'అవును, పరపురుషుల్ని తాకినా, తలచినా మహాపాపం కదా మరీ' అందావిడ.

మంగళసూత్రాల్ని మళ్ళీ కళ్ల కద్దుకుంటుందేమోనని ఆగింది సుగుణ. లేదు. అందుకని కొనసాగించబోతూంటే ఒక ఆలోచన వచ్చింది. ఆఫీసులో బాసుని తృణప్రాయంగా చూస్తే, ఉద్యోగం ఏమవుతుందా అని! అయితే, సందర్భాన్నిబట్టి అలా చూడాలిలే అని సర్దిచెప్పుకుంది. బస్సులో చీటికీ మాటికీ పొరపాటునో, కావాలనో తగిలే పరపురుషులు గుర్తుకొచ్చారు సుగుణకి. సావిత్రమ్మగారిలా మడి కట్టుకుని ఇంట్లో కూచోవడానికి తనకెలా కుదురుతుంది అనుకుని సర్దుకుంది.

'ఆఁ ఇంకా ఏం చెప్పిందమ్మా ద్రౌపది?' అని ఉత్సుకత చూపించిందావిడ. ఎందుకంటే, ఆ పాయింటుకే అన్నిటికన్నా ఎక్కువ మార్కులు. ఇందులో మొత్తం మార్కులు తెచ్చుకుంటేనే కదా పతివ్రత అనిపించుకోగలదు ఏ గృహిణి అయినా.

"5. స్నాన భోజన శయనాదుల్ని భర్తకన్న ముందుగా చెయ్యకూడదు".

'భోం చెయ్యడం, పడుకోవడం ఆడదానికి ఆలస్యంగా ఎలాగూ తప్పదు. స్నానం కూడా ముందుగా చెయ్యకూడదంటే ఎలా?' అంది సావిత్రమ్మగారు సాలోచనగా. మార్కులు తగ్గుతాయన్నట్లు ఆవిడ బాధ. సుగుణ తనకిందులో పూర్తిగా సున్న రావచ్చు అనుకుంది. ఆ మూడింటిలోనూ కూడా - భర్తకన్న ముందుగానో ఆలస్యంగానో వీలునిబట్టే గాని, రూలుని బట్టి కాదు సుగుణ చేయడం.

"6. భర్తకి చేయవలసిన సకల సేవల్నీ భోజనాది సమయాల్లో భార్యే స్వయంగా చెయ్యాలి. సేవకుల్ని నియమించకూడదు."

'నౌకర్లున్నా వాళ్లకిగాని, మన కెలాగూ వండి వడ్డించక తప్పదు. రాత్రిళ్లు కాళ్లు పట్టకా తప్పదు కదా' అంటూ నిట్టూర్పు విడిచిందావిడ.

'మరి మా అమ్మా వాళ్లింట్లో చుట్టాలొచ్చినప్పుడు వంటావిణ్ణి పెడితే ఆవిడే వడ్డించేదండి మా నాన్నగారికి కూడా. మరి మా అమ్మ ఆదర్శగృహిణి కాదంటారా?' అని అడిగింది సుగుణ.

'ఆఁ మరీ అంత తు. చ. తప్పకుండా పాటించాలంటే ఎలా సాగుతుంది? దేనికయినా పట్టూ విడుపూ ఉండాలి' అందావిడ సర్దుబాటు ధోరణిలో.

'అమ్మయ్య!' అనుకుంది సుగుణ. ఇందులో తనకి మార్కులు పోయినా ఫరవాలేదు. తను ముందుగా ఆఫీసుకి వెళ్లాల్సివచ్చినా, తనకి నీరసంగా ఉందని పడుకున్నా భర్తే అన్నీ బల్లమీద పెట్టుకుని వడ్డించుకు తిని, మళ్లీ గిన్నెలు వంటింట్లో సర్దేస్తూ ఉంటాడు.

'ఇప్పటి కెన్నైనాయమ్మా? ఆరా? ఇంకా ఉన్నాయా? ఉంటే చదువు' అందావిడ.

"7. పొదుపు చెయ్యాలి. భర్త సంపాదించిన దాన్ని దుబారా చెయ్యకూడదు."

'సరిగ్గానే చెప్పింది' అందావిడ.

సుగుణ అనుకుంది - తనూ సంపాదిస్తోంది కదా - భర్త దుబారా ఖర్చులు చేస్తే ఏమనాలి?

"8. ఇల్లూ, వంటిల్లూ, ఇంటిచుట్టూ పరిశుభ్రంగా ఉండేట్లు చూసుకోవాలి."

సావిత్రమ్మగారి కిందులో బాగా మార్కులొస్తాయని తెలుసు సుగుణకి. కడిగిందే కడుగుతూ ఇల్లూ వంటిల్లూ మహా శుభ్రంగా ఉంచుతుందావిడ. పని మనిషి గిన్నెల మసి వదిలే వరకూ తోమేదాకా దాన్ని తోమేస్తుందీవిడ. ఇల్లు కళాత్మకంగా పెట్టుకోవడం, వంటింట్లో గిన్నెలు తళతళలాడేట్లు ఉంచుకోవడం తనకీ ఇష్టమే. కాని కుదరొద్దూ? టైమూ ఉండదు, ఓపికా ఉండదు. ఎలా ఉన్నా భర్త పట్టించుకోడు కాబట్టి సరిపోతోంది సుగుణకి.

"9. మాటి మాటికీ వాకిట్లో నిలబడకూడదు."

సావిత్రమ్మగారేం మాట్లాడలేదు. తోచనప్పుడల్లా వీధి గుమ్మంలో నుంచుని చోద్యం చూడటం ఆవిడ కలవాటే. సుగుణకి అంత తీరుబడి ఉండదు - ఇంటిపనీ, ఆఫీసు పనితో.

"10. అసతులతో స్నేహం పనికి రాదు."

'ఎవరితో పనికిరాదంటుంది?' అని అడిగిందావిడ.

'అసతులు అంటే కులటలండీ'.

'అయ్యో, అయ్యో, ఆ మాట వేరే చెప్పాలా! పరువు పోదూ!' అందావిడ కొంగు రెండో భుజం చుట్టూ మరింత బిగదీసి లాక్కుంటూ.

సుగుణ కో సందేహం వచ్చింది- 'అసతి'కి పుల్లింగం ఏమిటో? - అని. 'అపతి' అంటారా? అసలా మాట ఉందా నిఘంటువులో? తన వెర్రి కాకపోతే, ఎందుకుంటుందీ!- అనుకుంది.

"11. చీటికీ మాటికీ పోట్లాటలు పెట్టుకోకూడదు."

'కావాలని ఎందుకు పెట్టుకుంటాం?' అందావిడ. సుగుణ ఒప్పుకుంది ఆవిడ అన్నదానికి.

"12. ఊరికే నవ్వకూడదు."

'నవ్వొస్తే నవ్వకుండా ఎలాగండీ? అయినా ఊరికే నవ్వుతారా ఎవరైనా, పిచ్చివాళ్లు తప్ప!' అంది సుగుణ.

'అలా కొట్టి పారెయ్యకమ్మాయ్! నవ్వు నాలుగు విధాల చేటు అన్నారు'.

'ఆడవాళ్లకే వర్తిస్తుందాండీ ఆ సామెత?'

'అంతేమరి. చూడు, ద్రౌపది దుర్యోధనుడిని చూసి నవ్వబట్టే కదా దుర్యోధనుడు పగబట్టాడు.'

'ద్రౌపది స్వానుభవంతో చెప్పిందన్నమాట! అవునుగాని సావిత్రమ్మగారూ, మీవారు ఎప్పుడైనా అరటి పండు తొక్కమీద కాలుజారి పడ్డారనుకోండి, మీకు నవ్వురాదా?'

'ఎందుకు రాదు!' అందావిడ ముసిముసిగా నవ్వుతూ. 'ఓసారి అలాగే జరిగింది. నా నవ్వు చూసి ఆయనకి ఎంత ఉడుకుమోత్తనం వచ్చిందనుకున్నావ్ కొట్టినంత పని చేశారు.'

'చూశారా మరి! నవ్వడం సహజం. నవ్వడానికి ఆడ, మగ తేడా ఉండదు, ఉండకూడదు.'

"13. వదరబోత్తనం ఉండకూడదు".

'ఎవరికీ ఉండకూడదు. ఆడా మగా తేడా ఏముంది?' అందావిడ.

"14. భర్త ఊళ్లో లేకపోతే 'పుష్పగంధ దీప్తాభరణ ప్రతతి' ధరించకూడదు."

సావిత్రమ్మగారు భర్త ఊళ్లో లేనప్పుడు పేరంటాలకి వెళ్లాల్సి వస్తే శుభ్రంగా ముస్తాబు చేసుకునే వెడుతుంది. ఆవిడకి ఆ సంగతి గుర్తుకొచ్చినట్టుంది.

'ఊరికే ఎవరు ముస్తాబు చేసుక్కూచుంటారు! అయినా, దొడ్లో పువ్వులు పూస్తూంటే ముత్తయిదువ కోసి తల్లో ముడుచుకుంటే తప్పేముంది?'

ఆవిణ్ణి సమర్థించింది సుగుణ - తనకి అసలు తల్లో పువ్వులు పెట్టుకునే అలవాటు లేకపోయినా, భర్త ఊళ్లో లేకపోతే బద్ధకించి వంట కూడా సరిగ్గా చేసుకోదు సుగుణ - ముస్తాబు మాట అలా ఉంచి.

"15. భర్త మీదే మనసు లగ్నం చేసి, భర్త ఆగమనాన్ని కాంక్షిస్తూ కాలం గడపాలి."

'వేరే పనులేం చేసుకోకుండా భర్తనే తలుచుకుంటూ ఎప్పుడు తిరిగొస్తాడా అని ఎదురుచూస్తూ కూచోవాలంటే ఎలా కుదురుతుందండీ?' అంది సుగుణ

'బాగా చెప్పావ్!' అందావిడ.

"16. అత్తగారి పట్ల భక్తి కలిగి ఉండాలి. ఆవిడ చెప్పినట్టు నడుచుకోవాలి. ఆవిడకి సపర్యలు చెయ్యాలి."

'చెప్పడం సులభమే! చేసే కోడళ్లుంటే మాత్రం, చేస్తే సంతోషించే అత్తలుండొద్దూ? అయినా, ఈ రోజుల్లో అలాంటి కోడళ్లెక్కడున్నారు!' అందావిడ కోడలిగానూ, అత్తగానూ తన అనుభవాల్ని గుర్తు చేసుకుంటూ.

'ఏదైనా జబ్బు చేస్తే సపర్యలు చెయ్యడం ఎలాగూ చెయ్యాలి, అంతేగాని ఉత్తినే ఎందుకండీ! అది సరే. ఏదైనా విషయంలో భర్త ఒకలాగ, అత్తగారు మరొకలాగ చెయ్యమంటే ఎవరి మాట వినాలనేది సమస్య కాదాండీ?' అంది సుగుణ.

ఆవిడ మాట్లాడలేదు.

"17. గురు విప్ర అతిథి పూజా సత్కారాలు చెయ్యాలి."

'పూర్వం అంతేమరి! అంత నిష్ఠగా చేసేవారు, ఆదరించేవారు. ఈ కాలంలో ధరలు మండిపోతూంటే అన్నీ యథావిధిగా సాగుతాయా!' అందావిడ.

'సరిగ్గా ఆఫీసుకి బయలుదేరే సమయానికి ఊరి నుంచి బంధుమిత్రు లెవరైనా హఠాత్తుగా దిగితే ఎంత చిరాకేస్తుంది! అతిథి పూజ కాదు, బడితె పూజ చెయ్యాలనిపిస్తుంది' అనుకుంది సుగుణ. పైకి అనలేదు.

"18. భర్త మెత్తని వాడు కదా అని గయ్యాళితనం చూపించకూడదు. అవకాశం వస్తే మెత్తని వాడు విషసర్పంలా మారగలడు?"

'ఏకు మేకవడం అంటే అదే!' అంది సుగుణ. ప్రియుడు మొగుడయాక మారినట్లు! - అనుకుంది మనసులో. సుగుణ మాటలకి ఆవిడ నవ్వింది మెత్తగా.

"19. సేవకుల మంచి చెడ్డల్ని చూసుకుంటూ ఉండాలి."

'చూసుకోవద్దు మరీ!' అందావిడ.

"20. ఇంటి ఖర్చుల విషయం చూసుకోవాలి."

'అదేఁవిటి! అవన్నీ ఇంటి యజమాని చూసుకోవాల్సిన పని కాదూ?' అందావిడ.

'మా ఇంట్లో మేమిద్దరం చూసుకుంటామండీ' అంది సుగుణ.

'అవునూ, మీరిద్దరూ సంపాదించుకుంటున్నారు కాబట్టి!' అందావిడ.

"21. కుటుంబ భారాన్నంతటినీ భర్తకి ఆయాసం కలక్కుండా నిర్వహించుకోవాలి."

'భారాన్నంతా భార్యే మోస్తే ఆవిడకి మాత్రం ఆయాసం కలగదుటండీ!' అంది సుగుణ.

'మాబాగా చెప్పావ్!' అంటూ సావిత్రమ్మగారు నవ్వి, 'భర్త అంటే భరించేవాడు అంటారు కదా' అంది.

'ఆఖరున ఏమని ముక్తాయింపు ఇచ్చిందో వినండి-

"22. భర్తకి శుశ్రూష చేసినందువల్ల సంతత శుభాలు కలుగుతాయి."

'సంతత శుభాలు ఎలా ఉన్నా, మహాపతివ్రత అనే బిరుదు మాత్రం లభిస్తుంది లెండి' అంది సుగుణ.

'అంతకన్న మహాభాగ్యం ఏముంటుందమ్మా!" అంటూ మంగళసూత్రాలు మరోసారి కళ్లకద్దుకుని, 'ఏమిటో, ఎంత చేసినా..' అంటూ నిట్టూర్చిందావిడ.

సుగుణ నవ్వుకుంది. ఎంత బిరుదు కోసం అయితే మాత్రం అంత భారం మొయ్యాలా! భర్తల మెప్పుకోసం, అత్తగారి మెప్పుకోసం, అందరి మెప్పుకోసం ఎంత చేసినా ఆ ద్రౌపది ఎన్ని అవమానాలు సహించవలసి వచ్చింది! అయితే, నిజానికి అవి ద్రౌపది స్వయంగా చెప్పిన సూత్రాలా?! పలికించినవాడు తొలుత వ్యాసుడు కాదూ? తెలుగు పద్యాల్లో తెలిపిన వాడు ఎఱ్ఱాప్రగడ! మధ్యలో ద్రౌపదిని తలుచుకుంటే జాలేసింది సుగుణకి. ఏమైనా, సావిత్రమ్మగారు మాత్రం అనుకున్నంత అమాయకురాలేం కాదులే! అనుకుంది.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 26-11-96 (ఆచార్య నాయని కృష్ణకుమారి గారి ప్రసంగవ్యాసం 'సాహిత్యం నాడు, నేడు - స్త్రీ స్థానం' ఇచ్చిన స్ఫూర్తితో రాసిన కథ)